## క్లుప్తంగా

### వెలుగు ఏపీఎంగా సులోచనా దేవి


సులోచనా దేవి

గంట్యాడ: మండల వెలుగు ఏపీఎంగా కోరుకొండ సులోచనా దేవి నియమితులయ్యారు. ఇదివరకు ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన వి శ్రీనివాస్‌కు డెంకాడ బదిలీ అయ్యింది. బొండపల్లి నుంచి సులోచనాదేవి ఇక్కడికి బదిలీపై రానున్నారు.

### పింఛన్ల పంపిణీ పరిశీలన


పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

బొండపల్లి: అంబటివలస గ్రామంలో అక్టోబర్ నెలకు సంబంధించి మంగళవారం నిర్వహించిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పరిశీలించారు. గ్రామంలో ఎంత మంది పింఛన్ లబ్ధిదారులున్నారు, వారికి ఎంత మంది సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల బయట ఉన్నవారికి కూడా పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### శిక్షణను సద్వినియోగించుకోండి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉచితంగా వివిధ అంశాల్లో ఇస్తున్న శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు సూచించారు. డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో కంప్యూటర్ కోర్సులు, తదితర అంశాల్లో మూడు నెలల పాటు యువతకు ఇచ్చిన శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇస్తోందన్నారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ సమన్వయకర్త డాక్టర్ జి.ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సిబ్బందికి బదిలీలు

మెరకముడిదాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు సిబ్బందికి బదిలీ అయ్యింది. డిప్యూటీ తహసీల్దార్ గిరిధర్‌కు రామభద్రపురం మండలానికి, సీనియర్ అసిస్టెంట్ నాగమణి చీపురుపల్లి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇక్కడికి తెర్లాం మండలం నుంచి డిప్యూటీ తహసీల్దార్‌గా జి.వి.భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్‌గా గజపతినగరం నుంచి ఎస్.అరుణ్‌కుమార్ మంగళవారం వచ్చారు. అలాగే ఆర్‌ఐగా పి.వి.వరహావెంకటమాధురి బాధ్యతలు స్వీకరించారు.

### జల్లా స్థాయి పోటీలకు సర్వేపల్లి విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో సర్వేపల్లి స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది

శృంగవరపుకోట: స్థానిక సర్వేపల్లి విద్యానికేతన్ స్కూల్‌కి చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో సత్తాచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్. సన్యాసిరావు మంగళవారం తెలిపారు. చదరంగం అండర్17 విభాగంలో పి.సూరజ్ కుమార్, పి.గ్రీష్మ, అండర్–14లో కె.దినేష్, ఎస్.వేదశ్రీ, వాలీబాల్‌లో బి.సాయితనీష్ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీ ఆర్.సురేష్‌ను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

### ఈ–శ్రమ్ కార్డులు తీసుకోండి


ఈ–శ్రమ్ కార్డుల కోసం కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఎల్ఓ కిరణ్, తదితరులు

శృంగవరపుకోట: అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు, వారి కుటుంబాల శ్రేయస్సు కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.కిరణ్, ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు డి.సూర్యారావు సూచించారు. సీతంపేట, ఎస్.కోట గ్రామాల్లో భవననిర్మాణ కార్మికులు, పెయింటర్లను మంగళవారం వారు కలిసి ఈ–శ్రమ్ పథకం గురించి వివరించారు. 16 నుంచి 59 ఏళ్ల మధ్య గల ప్రతి కార్మికుడూ ఈ–శ్రమ్ కార్డు తీసుకోవాలని సూచించారు. ఈకార్డులు ఉన్న వారికి ప్రమాదబీమాతో పాటు చాలా ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ స్వామి, మేస్త్రీల సంఘ అధ్యక్షుడు చింతాడ దేముడు, ఎం.అదిబాబు పాల్గొన్నారు.

# రిక్షాకాలనీ దాహం తీరింది

- నెల రోజులుగా తాగునీటి కష్టాల్లో రిక్షాకాలనీ
- ఆర్వోబీ పనుల్లో పాడైన తాగునీటి పైపులైన్
- పట్టించుకోని అధికార పార్టీ నేతలు, అధికారులు
- చొరవ తీసుకుని సమస్య పరిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు


ట్యాంకర్ల ద్వారా రిక్షాకాలనీకి తాగునీరు సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు(ఫైల్)


తాగునీటి పైపు లైన్ ఏర్పాటు పనులు చేపడుతున్న సిబ్బంది

చీపురుపల్లి: నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలోని రిక్షాకాలనీ వాసులు దాదాపు నెల రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని రాజాం రోడ్‌లో జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) పనుల్లో భాగంగా రిక్షాకాలనీకి వెళ్లే తాగునీటి పైపు లైన్ తెగిపోవ డంతో నీటి సరఫరా నిలిచిపోయింది. కాలనీ వాసుల కష్టాలను అధికారులు, అధికార పార్టీ నేతలు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ స్పందించి మేజర్ పంచాయతీ సిబ్బంది ద్వారా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయించారు. మరోవైపు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలి రెడ్డి శిరీష కూడా ట్యాంకర్లతో తాగునీరు అందజేశారు. ఇంత జరుగుతున్నా అధికార టీడీపీ నాయకులకు మాత్రం రిక్షాకాలనీ వాసుల తాగునీటి కష్టాలు కనిపించలేదు. కనీసం రిక్షాకాలనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ ఆర్వోబీ పనులు చేస్తున్న రైల్వే కాంట్రాక్టర్‌తో మాట్లా డారు. పైపు లైన్ పనులు చేపట్టాలని కోరడంతో ఆయన స్పందించారు. తాజాగా పైపులైన్ పనులు పూర్తవడంతో కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు తొలగిపోయాయి. యథావిధిగా కుళాయిల ద్వారా నీటి సరఫరా ప్రారంభం కావడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

#### చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం...



నెల రోజులుగా కాలనీకి తాగునీరు సరఫరా కాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ట్యాకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయించారు. అలాగే రైల్వే కాంట్రాక్టర్‌తో మాట్లాడి పైపు లైన్ పనులు జరిపించడంతో సమస్య పరిష్కారమయ్యింది.

– మజ్జి శంకర్, రిక్షాకాలనీ

#### ఇబ్బందులు తీరినట్లే..



చాలా రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో కష్టాలు ఎదుర్కొన్నాం. వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించి ట్యాంకర్లతో తమకు తాగునీరు సరఫరా చేశారు. లేకపోతే మరింత ఇబ్బందులు ఎదుర్కొనేవారం. తాజాగా పైపు లైన్ పనులు పూర్తవ్వడంతో ఇక ఇబ్బందులు తీరినట్లేనని అనుకుంటున్నాం.

– పాపారావు, రిక్షాకాలనీ

## పింఛన్ కోసం 6 కిలోమీటర్ల నడక


గొల్లుపాలెం సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న పింఛన్‌దారులు, సీపీఎం నాయకులు

బొండపల్లి: సామాజిక భద్రత పింఛన్‌ను లబ్ధిదారులకు ఇంటి వద్దే అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పలుగ్రామాల్లో ఆ విధానం అమలు కావడం లేదు. మండలంలోని గొల్లుపాలెం పంచాయతీ పరిధి ఎర్రొడ్లపాలెం,చిన్న గూడెం గిరిజన గ్రామాలకు చెందిన ఎనిమిది మంది పింఛన్‌దారులు అక్టోబర్ నెలకు సంబంధించిన పింఛన్ కోసం మంగళవారం 6 కిలోమీటర్ల దూరంలోని గొల్లుపాలెం గ్రామ సచివాలయానికి మండుటెండలో కాలినడకన రావాల్సి వచ్చింది. గతంలో వలంటీర్లు తమ ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాల్సి వస్తోందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి తొత్తడి పైడిపునాయుడు, సీపీఎం నాయకులు, పింఛన్ దారులు గొల్లుపాలెం సచివాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. పైడిపునాయుడు మాట్లాడుతూ గిరిజనులకు వారి ఇళ్ల వద్దే పింఛన్ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందడం లేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారని, ఆఫ్‌లైన్‌లో అయినా ఇంటి వద్దే పింఛన్ అందించాలని కోరారు. అనంతరం పింఛన్‌దారులు పంచాయతీ కార్యదర్శి కె.వి.పద్మకు వినతిపత్రం అందజేశారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు


ఉపాధ్యాయుడు సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు

చీపురుపల్లి: నవ సమాజ నిర్మాణంలో, బావిభారత పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఉపాధ్యాయుడిగా, ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన గదుల సత్యనారాయణను పాఠశాలలో హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అతిథులుగా హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో ఎన్నో వృత్తులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందన్నారు. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దగలిగే సామర్థ్యం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందన్నారు. గరివిడి ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, నాయకులు వలిరెడ్డి లక్ష్మణ, ఇప్పిలి గోవింద, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, ఏపీజీఈఏ గౌరవ అధ్యక్షుడు గిడిజాల లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని హరిణిని అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు

చీపురుపల్లి: మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మీసాల హరిణి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సెప్టెంబర్ 30న జిల్లాలోని తెర్లాం మండలం, నెమలాం ఉన్నత పాఠశాలలో జూనియర్స్ విభాగంలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో హరిణి ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈనెల 5, 6, 7 తేదీల్లో విశాఖపట్నం జిల్లాలోని అచ్యుతాపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుందని హెచ్‌ఎం చెప్పారు. విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.


దత్తిరాజేరు: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి

**షికారుగంజి మోడల్ స్కూల్ నుంచి..**

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్ నుంచి అండర్–17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హ్యాండ్ బాల్ పోటీలకు బాలికల విభాగంలో విమల, బాలుర విభాగంలో రోహన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి మంగళవారం తెలిపారు. సాలూరు డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ రాజేష్, ఉపాధ్యాయి సిబ్బంది అభినందించారు.

## రైతుల ఇబ్బందులు పట్టవా..?

- ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తుంటే మీరేం చేస్తున్నారు..?
- ఏఓపై ఎంపీపీ హైమావతి ఆగ్రహం
- సర్పంచ్‌లు,ఎంపీటీసీలను ప్రభుత్వ కార్యక్రమాలకు ఎందుకు పిలవడం లేదు..?
- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లభించక రైతులు ఇబ్బందులు పడుతుంటే కనిపించడం లేదా, రూ.270కు విక్రయించాల్సిన యూరియా బస్తాను ప్రైవేటు డీలర్లు రూ.300కు విక్రయి స్తుంటే మీరేం చేస్తున్నారు, ఎందుకు ఆ డీలర్లపై చర్యలు తీసుకోవడం లేదని ఎంపీపీ పీరుబండి హైమావతి మండల వ్యవసాయ అధికారి శ్యామ్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ, వైద్యారోగ్యం, విద్యా, ఉపాధి హామీ, వెలుగు, విద్యుత్,తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు.యూరియా లభించక పక్క జిల్లాకు వెళ్లి రూ.350, రూ.360కు కొనుగోలు చేస్తున్నామని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఏఓ స్పందిస్తూ పొటాష్ వచ్చిందని, యూరియా రెండు మూడు రోజుల్లో వస్తుందని చెప్పారు. ఎరువు వేయాల్సిన సమయం దాటిన తర్వాత వస్తే ఏం చేసుకుంటామని సభ్యులు ఏఓను ప్రశ్నించారు.

**పెండింగ్ బిల్లులు చెల్లించండి**

పెదవేమలి గ్రామంలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి సగం బిల్లులే అందాయని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎంపీటీసీ పొటువురెడ్డి భవాని హౌసింగ్ ఏఈ రాజ్‌గోపాల్‌ని కోరారు. ఏఈ స్పందిస్తూ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రావివలసలో చేపట్టిన సాగునీటి కాలువల పూడికతీత పనులు అసంపూర్తిగా వదిలేయడంతో పంటలకు సాగునీరు అందడం లేదని సర్పంచ్ సత్యనారాయణ సభలో ప్రస్తావించారు. ఉపాధి హామీ ఏపీఓ సుందరరావు స్పందిస్తూ వెంటనే పనులు పూర్తి చేసేలాచర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ఎందుకు పిలవడం లేదని అధికారులను సభ్యులు ప్రశ్నించారు. వెలుగు వీఓఏలను, ఫీల్డ్ అసిస్టెంట్లను ఏ ప్రాతిపదికన తొలగిస్తున్నారని మదనాపురం సర్పంచ్ జాగరపు అప్పారావు ఉపాధి హామీ ఏపీఓను, వెలుగు ఏపీఎం శ్రీనివాస్‌ను నిలదీశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు గురించి తనకు తెలియదని, ఏపీడీ విచారణ చేసి తొలగించారని ఉపాధి ఏపీఓ బదులివ్వగా, వీఓఏల తొలగింపుపై వెలుగు ఏపీఎం స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఎంపీడీఓ వై.భవాని తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే అధిక దిగుబడి

వరి, ఇతర పంటల్లో సస్యరక్షణలు పాటించడం ద్వారా, పంటను ఆశించిన తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు వివరించారు. ఎస్.కోట మండలంలోని కొట్టాం,కొత్తకోట, వేపాడ మండలంలో ని పాటూరు, సోంపురం, జామి మండలంలోని జాగరం, వి.ఆర్.పాలెం, గంట్యాడ మండలంలోని కొర్లాం, గొడియాడ గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు, శాస్త్రవేత్తలు హాజరై రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్యపద్ధతులపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో వరి, తదితర పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణకు పిచికారీ చేయాల్సిన పురుగు మందులను సిఫార్సు చేశారు.

– శృంగవరపుకోట/వేపాడ/జామి/గంట్యాడ


శృంగవరపుకోట: కొట్టాంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


గంట్యాడ: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ చంద్రశేఖర్‌బాబు


వేపాడ: పాటూరులో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు


జామి: జాగరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

### భవిత కేంద్రంలో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న అధికారి కల్పన

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త ఎస్.కల్పన మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు ప్రత్యేక అవసరాల పిల్లలతో ముచ్చటించారు. పిల్లలకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలతో పాటు ఆటపాటలతో కూడిన విద్యపై కేంద్రం ఐఈఆర్టీలను ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా సహిత విద్య సహాయ సమన్వయకర్త ఎం.భారతి, ఐఈఆర్టీలు ఎర్రా శ్రీనివాసరావు,సత్యనారాయణ ఉన్నారు.

## డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

- డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): డ్రగ్స్, మత్తుపదార్థాలు తీసుకోవడం ద్వారా జీవితాలు నాశనమవుతాయని, యువత, విద్యార్థులు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా గరివిడి అవంతీ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియం త్రణపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఒక వ్యక్తి డ్రగ్స్‌కు అలవాటు పడితే అతనితో పాటు వారి కుటుంబం కూడా వీధిన పడుతుందన్నారు. డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని, విద్యార్థి దశలో ఎంత శ్రమిస్తారో అంతే ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు.అనంతరం డ్రగ్స్ జోలికి వెళ్లబోమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ శంకరరావు,ఎస్ఐ బి.లోకేశ్వరరావు,వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్‌కు మార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి అవంతీ కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

**ఎస్.కోటలో..**

శృంగవరపుకోట: 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో పోలీసులు మంగళ వారం అవగాహన కల్పించారు. ఎస్.కోట సీఐ ఎన్.వి.రమణమూర్తి మాట్లాడుతూ జీవితాలను, కుటుంబాలను నాశనం చేసే డ్రగ్స్ జోలికి పోవద్దని సూచించారు.ఎస్.కోట ఎస్ఐ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహనకల్పిస్తున్న సీఐ ఎన్.వి.రమణమూర్తి

**వేపాడలో..**

వేపాడ: సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వల్లంపూడి ఎస్ఐ బి.దేవి మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్‌డీపీఎస్ చట్టాలపై వీడియోలు ప్రదర్శించి, కరపత్రాలు పంపిణీ చేశారు.యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేశారు.అలాగే వల్లంపూడి గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు.


వేపాడ: వేపాడ ప్రభుత్వ జూనియర్ కాలెజ్‌లో అవగాహనకల్పిస్తున్న ఎస్ఐ దేవి

### ఓటు నమోదు చేసుకోండి


మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

వేపాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని పీఆర్టీయూ మండల నాయకులు ఉపాధ్యాయులు, అధ్యాపకులను కోరారు. వేపాడ మండల కేంద్రంలోని పలు పాఠశాలకు పీఆర్టీయూ నేతలు మంగళవారం వెళ్లి ఓటరు నమోదు దరఖాస్తులను ఉపాధ్యాయులకు అందజేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చామలాపల్లి గ్రామస్తులు, సహోపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని చామలాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న హెచ్‌ఎం పి.జి.ఎస్.సతీష్‌కుమార్, ఉపాధ్యాయుడు ఆశపు శ్రీనివాస్‌ను గ్రామపెద్దలు పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా అందుకోగా, హెచ్‌ఎం సతీష్‌కుమార్‌కు లక్ష్య ఫౌండేషన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేసింది. వీరిని పాఠశాలలో సర్పంచ్ జుత్తాడ సూర్యారావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ సీహెచ్.జ్యోతి, తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సహచర ఉపాధ్యాయులు సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వి.రమణ, ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎం.వి.ఏ.ఎస్.నారాయణ, గౌరవ అధ్యక్షుడు వి.ఎస్.దేముడు, సభ్యులు టి.సింహాచలం నాయుడు, పి.గణపతిరావు, కె.కృష్ణ, షేక్ కబీర్, ఉపాధ్యాయులు ప్రకాష్‌రావు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి చెకుముకి పోటీలు


వేపాడ: పరీక్ష పేపర్లను విడుదల చేస్తున్న హెచ్‌ఎం వల్లి, ఉపాధ్యాయులు


శృంగవరపుకోట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


మెరకముడిదాం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతనిధి రఘునాథరాజు, తదితరులు


చీపురుపల్లి: ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎంఈఓ బూసినాయుడు


జామి: చెకుముకి టెస్ట్‌కు హాజరైన విద్యార్థినులు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను చీపురుపల్లి, వేపాడ, జామి, ఎస్.కోట, మెరకముడిదాం మండలాల్లో మంగళవారం నిర్వహించారు. ఇది వరకు పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈపరీక్షకు హాజరయ్యారు. చీపురుపల్లి ఎమ్మార్సీ, వేపాడ, జామి, మెరకముడిదాం ఉన్నత పాఠశాలలు,ఎస్.కోట బాలికోన్నత పాఠశాల కేంద్రంగా పరీక్షలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, యూటీఎఫ్ నాయకులు పరీక్ష పేపర్లను ఆవిష్కరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసి, అభినందించారు.మండల స్థాయి విజేతలకు ఈ నెల 27న జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు చెప్పారు.

– చీపురుపల్లి/వేపాడ/జామి/శృంగవరపుకోట/మెరకముడిదాం